తడిసిన సోయాను జాలి సాయంతో వేరు చేస్తున్న రైతులు

తడిసిన సోయా

భైంసా, అక్టోబర్ 14 : భైంసా పట్టణంలోని గాంధీగంజ్‌కు అమ్మకానికి తీసుకొచ్చిన సోయా తడిసింది. సోమవారం సాయంత్రం వర్షం కురియడంతో రైతులు అవస్థలు పడ్డారు. క్వింటాలుకు రూ.4,566 ధర ఇవ్వడంతో రైతులు వ్యాపారస్తుల వద్దకు తీసుకొచ్చారు. కొద్దిపాటి వర్షంతో రైతులకు ఇబ్బందులు తలెత్తాయి.

రైతన్న రాస్తారోకో

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆందోళన

శ్యాంపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 14 : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రైతులు ఆందోళన నిర్వహించారు. శ్యాంపూర్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాన రహదారిపై రాస్తారాకో నిర్వహించి నిరసన తెలిపారు. దాదాపు ఆరగంట ఆందోళన నిర్వహించగా.. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పూర్తి స్థాయిలో రణమాఫీ చేయలేదని, పంట నష్టపరిహారం అందించాలని, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చారు. ఆందోళన చేస్తున్న వారికి సర్ధి చెప్పి విరమింపజేశారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

ఉట్నూర్, అక్టోబర్ 14 : గిరిజనుల అభివృద్ధే తమ లక్ష్యమని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం గిరిజన దర్బార్‌లో భాగంగా పీవో క్యాంపు కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన అనసూయ ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలంలోని ధర్మగూడ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామానికి పాఠశాల భవనం, వ్యవసాయ మోటర్ మంజూరు చేయాలని, ఇచ్చోడ మండలానికి చెందిన అర్చన కంప్యూటర్ ఉద్యోగం ఇప్పించాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు, పింఛన్లు, ఇతర పలు సమస్యలను విన్నవించారు. అనంతరం కొత్తగా ఎస్‌జీటీ ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించిన వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఈఈ భీంరావు, మనోహర్, దామోదర్, సందీప్ కుమార్, నాగభూషణం, వసంత్‌రావు, ప్రవీణ్, మేనేజర్ లింగు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాగ్ డేను ఘనంగా నిర్వహించాలి

ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, అక్టోబర్ 14 : ఫ్లాగ్ డే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లాగ్ డే (పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం) సందర్భంగా పలు ప్రజాహిత కార్యక్రమాలు చేస్తామన్నారు. ప్రజలు, విద్యార్థులు వారోత్సవాల్లో పాల్గొనాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రజాహిత కార్యక్రమాల్లో భాగంగా 21వ తేదీన ఫ్లాగ్ డే, మెగా రక్తదానం, ఓపెన్ హౌస్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. సైకిల్ ర్యాలీ, పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద అమరవీరుల చిత్రపటాల ఏర్పాటు, షార్ట్ ఫిలిం, ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయన్నారు. మొదటి మూడు ఫొటోలు, వీడియోలను జిల్లా స్థాయిలో ఎంపిక చేసి బహుమతులు అందిస్తామన్నారు. వీటికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే విధంగా అర్హత లభిస్తుందన్నారు. ఈ ఫొటోలు, వీడియోలను ఈనెల 23వ తేదీ లోగా వివరాలతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్ఐబీ, ఐటీ కోర్ కార్యాలయంలో అందించాలని సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపై గురి!



ఉమ్మడి జిల్లాలో ప్రచారం మొదలుపెట్టిన ఆశావహులు

- అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్టాత్మకం కానున్న ఎన్నిక
- నవంబర్ 6వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం

మంచిర్యాల, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రస్తుత ఎమ్మెల్సీ పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29తో పూర్తవనుంది. దీంతో ఈ స్థానానికి ఎన్నికలు నిర్వహించడంపై రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. సెప్టెంబర్ 30వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి ఓటర్ల నమోదు ప్రక్రియను చేపట్టింది. డిసెంబర్ 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు డిసెంబర్ 30వ తేదీన ఓటరు జాబితాను విడుదల చేయనుంది. అన్ని జిల్లాల కలెక్టరేట్లు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో 2021 నవంబర్ 11లోపు డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఓటరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇవీ కాకుండా ఆశావహులు ఓటరు నమోదు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. డిగ్రీ మెమో, ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఎలక్షన్ కార్డు ఎపిక్ నంబర్, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ డిటేయిల్స్, పాస్‌ఫొటో, ఫామ్-18తో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. 2019 ఎన్నికల్లో ఈ స్థానంలో 1.96 లక్షల మంది గ్రా డ్యుయేట్లు మాత్రమే ఓటర్లుగా నమోదు కాగా, ఈసారి ఈ సంఖ్య 9 నుంచి 10 లక్షలకు చేరుకునేలా అవగాహన కార్యక్రమాలు, ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టారు.

పార్టీలకు ప్రతిష్టాత్మకం

ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఇదే అధికార కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ సీటు కావడంతో తిరిగి ఎలాగైనా పాగా వేయాలని ప్రయత్నిస్తున్నది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికల కీలకంగా మారింది. కాంగ్రెస్ పాలనపై ఉన్న వ్యతిరేకతను ఈ ఎన్నికల్లో గెలిచి జనంలోకి బలంగా వెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తున్నది. కాగా.. బీజేపీకి కూడా ఈ ఎన్నికలు కత్తిమీద సాములా మారాయి. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటారు. దీంతో ఎమ్మెల్సీగా తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునే వ్యూహాల్లో ఆ పార్టీ ఉన్నది.

గంపెడాశల్లో అభ్యర్థులు

రాజకీయ పార్టీలకు కీలకంగా మారిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నారు. అధికార పార్టీ నుంచి పోటీ చేసి గతంలో ఇదే స్థానం నుంచి గెలిచిన జీవన్‌రెడ్డి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. దీంతో ఈ సారి తిరిగి ఎమ్మెల్సీగా నిలబడాలని ఆసక్తిగా ఉన్నారు. గతంలో ఏడాది కాలంపాటు ఎమ్మెల్సీగా ఉండి రాజీనామా చేసిన ఆర్.సత్యనారాయణ కూడా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్నారు. వీరితోపాటు మరికొందరు అధికార పార్టీ నుంచి మాకే టికెట్ వస్తుందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ అభ్యర్థిని అనుసరించి బలమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తున్నది. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా బయటపడుతున్న నేపథ్యంలో దాన్నే ఈ ఎన్నికల నినాదంగా జనంలోకి బలంగా వెళ్లేందుకు సిద్ధమవుతున్నది. అందుకు తగినట్లుగానే ఆ పార్టీ నుంచి అభ్యర్థిని ప్రకటించనుంది. ఇక బీజేపీ నుంచి కూడా చాలా మంది పేర్లు వినిపిస్తున్నాయి. మంచిర్యాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు అధిష్ఠానంతో ఆయన టచ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ పార్టీ నుంచి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాణి రుద్రమదేవీ పేర్లు వినిపిస్తున్నాయి. ఇకపోతే పార్టీలతో సంబంధం లేకుండా కొందరు గ్రాడ్యుయేట్స్ పోటీకి సిద్ధమవుతున్నారు. వీలైతే పార్టీ నుంచి లేనిపక్షంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని చూస్తున్నారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల రేసులో నిలబడడం దాదాపు కాయమైపోయింది. ఇక నిర్మల్ జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సీపీఎస్ ఉద్యమకారుడు కృష్ణారావు ఈసారి బరిలో ఉండనున్నారు. సీపీఎస్ ఉద్యమకారుల ఓటు బ్యాంక్ ఈ నాలుగు జిల్లాల్లో అధికంగా ఉండడంతో ఆయన కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా మారారు. ఇలా ఎవరి వారు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తూనే, ప్రచారం చేస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, గ్రాడ్యుయేట్లను తమవైపు తిప్పుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రభుత్వ ప్రైవేటు టీచర్లు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను కవర్ చేస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి ఐదారునెలల ముందే మొదలైపోయింది.

రుణమాఫీ వర్తింప చేయాలని ప్రజావాణిలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవిని కలిసి దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

- ప్రజావాణికి తరలివచ్చిన రైతులు
- అధికారులకు వినతిపత్రాల అందజేత
- అధికారుల చుట్టూ తిరగలేక పోతున్నామని ఆవేదన
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

సారూ.. రుణమాఫీ చేయండి

ఆదిలాబాద్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ) : జిల్లాలోని చాలా మంది రైతులకు రుణం మాఫీ కాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రైతుల వివరాలను తప్పుగా నమోదు చేయడంతో సాయానికి దూరమయ్యారు. అన్ని అర్హతలు ఉన్నా.. మూడు నెలలుగా అధికారుల చుట్టూ తిరిగినా మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయం, బ్యాంకు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగి రైతులు విసిగివేసారి పోతున్నారు. తప్పుల సవరణ కోసం బ్యాంకులకు వెళ్తే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని, వారిని కలిస్తే బ్యాంకులకు వెళ్లాలని సూచిస్తున్నారు. జిల్లాలో ఎంతమందికి రుణమాఫీ అయింది కాలేని విషయాలు అధికారుల వద్ద లేకపోవడంతో వారు ఏమీ చేయలేకపోతున్నారు.

55,961 మందికి రుణమాఫీ

ఆదిలాబాద్ జిల్లాలో 1.47 లక్షల మంది రైతులు ఉండగా.. 1.35 లక్షల మందికి బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. రూ.2 లక్షలకు పైగా బ్యాంకు రుణాలు ఉన్న రైతులు 47 వేల మంది వరకు ఉంటారు. ప్రభుత్వం రుణమాఫీలో భాగంగా మూడు విడుతల్లో 55,961 మంది రైతులకు రూ.608.88 కోట్లు మాఫీ చేసింది. రూ.2 లక్షల వరకు బాకీ ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో మాఫీ కాలేదు. బ్యాంకులో పొరపాట్లు, రేషన్, ఆధార్ కార్డులు, పట్టా పాసుపుస్తకాల వంటి సమస్యల కారణంగా చాలా మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. లోన్ మాఫీ కానీ రైతుల నుంచి ప్రభుత్వం ఇటీవల రైతువేదికల్లో దరఖాస్తులను స్వీకరించింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి రైతులు తరలివచ్చారు. తమ బ్యాంకు లోన్‌ను మాఫీ చేయాలని అధికారులకు దరఖాస్తులు అందజేశారు.

మూడు నెలల నుంచి తిరుగుతున్నా..

నాకు ఆరున్నరెకరాల భూమి ఉంది. అందులో సాగు చేస్తూ ఉపాధి పొందుతా. నేను తలమడుగు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.2 లక్షలలోపు లోన్ బాకీ ఉన్నా. ప్రభుత్వం అందించిన రుణమాఫీ నాకు వర్తించలేదు. రైతు వేదికలో దరఖాస్తు ఇచ్చినా. వ్యవసాయ అధికారుల దగ్గరికీ వెళ్తే బ్యాంకుకు పోమ్మంటున్నారు. బ్యాంకు అధికారులను సంప్రదిస్తే మీ వివరాలు పంపించాం. మాకు ఏమీ తెలియదు అని చెబుతున్నారు. మూడు నెలల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదు. బ్యాంక్ లోన్ మాఫీ చేయాలని కలెక్టర్‌ను కలిసి దరఖాస్తు ఇవ్వడానికి వచ్చా.

- సీడాం దీపక్, పల్సి (బీ), తలమడుగు మండలం

మా గ్రామంలో చాలామందికి రుణమాఫీ కాలేదు

మేము ఆదివాసీ గిరిజన రైతులం. అందరికీ ఐదెకరాల లోపు భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటూ ఉపాధి పొందుతాం. మా గ్రామంలో కేవలం పది శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయింది. పేద రైతులమైన మేము రూ.2 లక్షల లోపు బ్యాంకులో లోన్ తీసుకున్నాం. కేసీఆర్ సర్కారు హయాంలో మాకు రైతుబంధు వచ్చింది. ఈ గవర్నమెంట్‌లో రుణమాఫీ చేయాలంటూ వ్యవసాయ, బ్యాంకు అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. డబ్బులు ఖర్చు అవుతున్నాయి తప్పా పని అవడం లేదు. ఈ రోజు జిల్లాలోని మారుమూల గ్రామమైన గాదిగూడ మండలంలోని అర్జునికొలాంగూడ నుంచి రైతులందరం కలిసి కలెక్టర్‌ను కలిసి మాకు రుణమాఫీ చేయాలని దరఖాస్తు ఇచ్చినాం. ఇప్పటికైనా మా బ్యాంక్ లోన్‌లు రద్దు అవుతాయని ఆశిస్తున్నాం.

- అర్జుని కొలాంగూడ, గాదిగూడ మండలం గ్రామస్తులు

రుణమాఫీ చేయాలని దరఖాస్తు ఇచ్చా..

గ్రామంలో మా తల్లి భోజవ్వ పేరిట మూడెకరాల భూమి ఉంది. రూ.1.39 లక్షల బ్యాంకు లోన్ నేరడిగొండ సహకార బ్యాంకులో ఉన్నాం. ప్రభుత్వం ప్రకటించిన రూ. 2 లక్షల రుణమాఫీ మాకు వర్తించలేదు. ఆన్‌లైన్‌లో నో పాస్‌బుక్ అని వస్తుంది. బ్యాంకు లోన్ మాఫీ చేయాలని వ్యవసాయ అధికారులను కలిసినా బ్యాంకులో సంప్రదించినా రుణమాఫీ కాలేదు. బ్యాంక్ లోన్ రద్దు చేయాలని కలెక్టర్‌ను కలిసి దరఖాస్తు అందజేశా.

- భోజన్న, వడూర్, నేరడిగొండ మండలం

మా ఇంట్లో ఇద్దరికీ మాఫీ కాలేదు..

మా ఇంట్లో నా భార్య, కొడుకు పేరిట బ్యాంకు రుణాలు తీసుకున్నాం. మా భార్య కౌసల్యబాయి పేరు మీద ఇంద్రవెల్లి గ్రామీణ బ్యాంకులో రూ.1.85 లక్షలు, కొడుకు కార్తీక్ పేరిట సిరికొండ గ్రామీణ బ్యాంకులో రూ.1.84 లక్షల రుణం ఉంది. ఇద్దరికీ రూ. 2 లక్షల లోపు లోన్ ఉన్నా ఒక్కరికీ కూడా మాఫీ కాలేదు. రైతువేదికలో దరఖాస్తు ఇచ్చినా. బ్యాంకు అధికారులను అడిగినా మాకు ఏమీ తెలియదు అంటున్నారు. కలెక్టర్‌ను కలిసి దరఖాస్తు ఇవ్వడానికి ఇంద్రవెల్లి నుంచి వచ్చా.

- జాదవ్ ప్రకాశ్, రైతు, ఇంద్రవెల్లి

బోథ్ : ప్రధాన ద్వారం వద్ద బంద్‌ను సూచిస్తూ కట్టిన ఫ్లెక్సీ

కుంటాల : కల్లూరులోని వాసవి డిగ్రీ కళాశాల ముందు నిరవధిక సమ్మెలో పాల్గొన్న సిబ్బంది

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

బోథ్, అక్టోబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరుతూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం బోథ్‌లో డిగ్రీ కళాశాలల బంద్ పాటించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడం మూలంగా కళాశాలలు నిర్వహించలేని స్థితిలో ఉన్నామని యాజమాన్యం పేర్కొన్నది. బకాయిలు చెల్లించే వరకు డిగ్రీ కళాశాలు మూసి ఉంచుతామని స్పష్టం చేశారు.

కల్లూరులో వాసవి..

కుంటాల, అక్టోబర్ 14 : కల్లూరులో వాసవి డిగ్రీ కళాశాలలో జరిగిన నిరవధిక సమ్మెలో ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ఎగ్జిక్యూటివ్ మెంబర్ బోయి సాయిలు పాల్గొని మాట్లాడారు. బకాయిలు చెల్లించే వరకు డిగ్రీ కాలేజీలను తెరవమని అన్నారు.

బేలలోని కీర్తన..

బేల, అక్టోబర్ 14 : పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వరప్రసాద్‌రావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గెడం ప్రవీణ్, సీనియర్ అధ్యాపకులు పుష్ప, ప్రియాంక, సౌందర్య పాల్గొన్నారు.

వెంటనే విడుదల చేయాలి..

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 14 : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవడంపై ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం జిల్లా అధ్యక్షుడు నరేశ్ గౌడ్ తెలిపారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య సర్వసభ్య సమావేశం స్థానిక వశిష్ట డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో సంఘ నాయకులు వెంకట్‌రెడ్డి, సాయిలు, అఖిల్‌సింగ్, విఠల్‌రావు, వెంకటేశ్ గౌడ్, బాలానంద్, రవి, లక్ష్మణ్, సంజీవ్, శ్రీనివాస్, లోహిత్, వర్ధన్, శ్రీధర్ పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్ : మాట్లాడుతున్న నాయకులు

బేల : సమావేశంలో మాట్లాడుతున్న కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వర ప్రసాద్‌రావ్

సమస్యలను పరిష్కరించాలి

ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 14 : ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడకగదుల ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. శాఖలవారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.